క్లుప్తంగా

పంటక్షేత్రాల పరిశీలన



గీసుకొండ: మండలంలోని ధర్మారం, గీసుకొండ గ్రామాల్లో పంట క్షేత్రాలను జిల్లా వ్యవసాయ అధికారి డి. ఉష బుధవారం పరిశీలించారు. వేరుశనగ, వరి, మొక్కజొన్న తదితర పంట చేలల్లో చీడపీడలు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు పలు సూచనలు చేశారు. ఎన్ఎస్ఎఫ్ఎం కన్సల్టెంట్ పి.సారంగపాణి, ఉమ్మడి జిల్లా, కావ్య వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలి

దుగ్గొండి: లంబాడీల ఆరాధ్యదైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవురోజుగా ప్రకటించాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త ధరావత్ వీరస్వామినాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ జయంతి రోజున లంబాడీలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్టతో బోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది లంబాడీలు పండుగ జరుపుకుంటారన్నారు. ప్రభుత్వాలు పరిశీలించి సెలవును ప్రకటించాలని ఆయన కోరారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు ఘనసన్మానం



వర్ధన్నపేట: పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను బుధవారం హన్మకొండలో జరిగిన ఓ కార్యక్రమంలో డీఎస్ఎస్ఎస్ తరఫున శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించినట్లు దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. బుధవారం వర్ధన్నపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులకు, భారత సైనికులకు ఇండ్ల స్థలాలు కేటాయించినట్లుగానే పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉపకులాల్లో ఉన్న వారి నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఉన్నత స్థాయిలో చూడాలన్నారు. ఇందుకు గడ్డం సమ్మయ్య దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సమ్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు

మండల పార్టీ అధ్యక్షుడికి ఘన సన్మానం

రాయపర్తి : కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఈదులకంటి రవీందర్‌రెడ్డిని కొండూరు, రాగన్నగూడెం గ్రామ కాంగ్రెస్ నేతలు బుధవారం ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటయ్య,మారయ్య,సాయిలు, సతీష్, సురేష్, రాంబాబు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



సంగెం: హక్కుల సాధనకు ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడుగా మెట్టుపల్లి రమేష్‌ను రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కమిటీలు వేసి మండల కమిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెట్టుపల్లి కొమురయ్య, వరంగల్ జిల్లా ప్రతినిధి కొమ్ముల బిక్షపతి, నాయకులు ఎర్రోల్ల సుదర్శన్, వేల్పుల ఆంజనేయులు, మెట్టుపల్లి ప్రవీణ్, నవిండ్ల ఏలియా తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ యాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు బుధవారం షిర్డీ యాత్రకు వెళ్లారు. పరకాల ఎమ్మెల్యేగా ప్రకాశ్‌రెడ్డి విజయం సాధించిన సందర్భంగా మొక్కులు చెల్లించేందుకు వెళ్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రవీందర్ గౌడ్ తెలిపారు. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, రవి, ఉన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడి

జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాళ్



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్

చెన్నారావుపేట: వరి, మొక్కజొన్న పంటల్లో అధిక దిగుబడులు రావాలంటే తెగుళ్లు, పంటలు నాశనం చేసే పురుగులను గుర్తించి తగు జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారిని డి.ఉషాదయాళ్ అన్నారు. మండలంలోని ఉప్పరపల్లిలో చిలపాకస్వామి, వరి, మొక్కజొన్న పంటలో బుధవారం క్షేత్ర సందర్శనను ఉమ్మడి జిల్లా ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం, వ్యవసాయ విస్తరణాధికారి ఓదెల వినయ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలను పరిశీలించిన అనంతరం వారు పలు సూచనలు చేశారు.

వరిలో కాండం తొలుచు పురుగు నివారణ

వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని తెలుసుకోవడానికి ఎకరాకు 8 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. లింగాకర్షక బుట్టల్లో 25–30 మొక్క రెక్కల పురుగులు వారానికి గమనించినట్లయితే పంటను నష్టపరిచే స్థాయిని పరిగణించాలి. 20 నుంచి 25 రోజుల దశలో కర్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోల లేదా క్లోరంట్రానిలిప్రోల్ 4జి గుళికలు 4 కిలోలు లేదా కార్టఫ్ హైడ్రాక్లోరైడ్ ఫోర్ జి గుళికలు 8 కిలోలు ఎకరాకు సమానంగా ఇసుకలో కలుపుకొని పలుచగా నీరు ఉంచుకొని కలిసే విధంగా పిలకదశలో చల్లుకోవాలి. లేదా క్లోరంట్రనిలిప్రోల్ 60 మీ.లీ కార్టాఫ్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు చొప్పున 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసినట్లయితే అరికట్ట వచ్చు. లేదా టెట్రానిలిప్రోల్ 80 మీ.లీ ఎకరాకు చొప్పున 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకున్నట్లయితే అరికట్టవచ్చు.

వరిలో అగ్గి తెగులు నివారణకు:

ట్రైసైక్లజోల్ 120 గ్రా. లేదా ట్రైసైక్లజోల్‌ను మ్యాంకోజబ్(మొర్జర్) 500 గ్రాములు ఎకరాకు లేదా టేబుకోనాజోల్‌ను ట్రిప్లాక్సీ స్ట్రోబిన్ (నేటివో) కలిపి 80 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

వరిలో కలుపు యాజమాన్యం

ఎకరాకు ప్రెటిలాక్లోర్‌ను సెఫ్నర్ మందును 600–800 మి.లీ కలిపి విత్తిన 3–5 రోజులలోపు లేదా పైరాజోసల్ఫూరాన్ ఈథైల్ 80–100 గ్రా. లేదా బ్యూటాక్లోర్ 1.1.5 లీ లేదా ప్రెటిలాక్లోర్ 500 మి.లీ లేదా ప్రెటిలాక్లోర్‌ను పైరాజోసల్ఫ్యూరాన్ 4 కిలోలు ఇసుకలో కలిపి చల్లాలి. ఎకరాకు సైహాలోఫాస్ పిబ్యూటైల్ 300 మి.లీ లేదా విత్తిన 15 రోజులకు లేదా బిస్పైరిబాక్ సోడియం 100 మి.లీ విత్తిన 20 రోజులకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. బిస్పైరిబాక్ సోడియం వెడాల్పాకు గడ్డి జాతిని కూడా అరికట్టును. వెడాల్పాకు కలుపు నివారణకు 2,4–డి సోడియం స్టాల్ 600 గ్రా. విత్తిన 25–30 రోజులు పిచికారి చేయాలి. పంట దశను కలుపు రకాన్ని బట్టి కలుపు మందును ఎంచుకోవాలి. తుంగ, గడ్డిజాతి కలుపు నివారణకు ఫెనిగ్జిలియంను సైలాఫక్షప్ బాటిల్‌ను కలుపుకొని ఎకరాకు 800 మి.లీ చొప్పున పిచికారి చేయాలి. వరిలో జింకు లోపం గమనించినట్లయితే 2 గ్రాములు జింక్ సల్ఫేట్‌ను లీటరు నిటిలో కలిపి 5 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారి చేయాలి.

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ

మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు మొదటి దశలో వేపనూనె 5 మి.లీ లేదా ఇమామ్యాక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటిలో కలుపుకొని మొగిలోపల సుడిలో పడే విధంగా పిచికారీ చేసి పురుగును అరికట్టాలి.

విషపు ఎరను తయారు చేసుకొని సుడిలో వేసుకోవాలి. ఎకరానికి 10 కిలోల తౌడు, 2 కిలోల బెల్లం తీసుకుని, బెల్లంను 2–3 లీటర్ల నీటిలో కరిగించి, తర్వాత తౌడులో కలిపిన మిశ్రమాన్ని 24 గంటలు పులియనిచ్చి అరగంట ముందు ఈ మిశ్రమాన్ని 100 గ్రాముల థయోడికార్బ్(లార్విన్)కలిపి మొక్క సుడిలో వేస్తే సమర్ధవంతంగా కత్తెర పురుగును అరికట్టవచ్చు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరాకు 3 కిలోలు మొగిలో పడే విధంగా వేసుకోవాలి. మొక్కజొన్నలో స్టాక్‌రాట్ నివారణకు బ్లీచింగ్ పౌడర్ 800 గ్రాములు ఎకరాకు మొక్కలపూవి పడే విధంగా వేసుకోవాలి. అలాగే 4 కిలోల బ్లీచింగ్ పౌడర్‌ను నేలలో వేసుకొని నివారించుకో వచ్చు. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన పంటలో వచ్చే తెగులు, పురుగులను నివారించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు.

వైద్య కళాశాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

నర్సంపేట: నర్సంపేట వైద్యకళాశాలకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎనిమిది మెడికల్ కాలేజిలకు మంజూరు ఇవ్వగా అందులో ఐదింటికి ఆమోదం రావడం శుభసూచికం అన్నారు. ఇప్పటికే జిల్లా ఆస్పత్రి నిర్మాణం ఉండడంతో మెడికల్ కాలేజికి అనుమతి రావడం జరిగిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్, హరీష్‌రావుల చొరవతోనే నర్సంపేటకు జిల్లా ఆస్పత్రి, మెడికల్ కళాశాల తీసుకురావడం జరిగిందన్నారు. డాక్టర్ విమలాథామస్ కమిటీ అనుమతి ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. గత ప్రభుత్వం మెడికల్, ఇతర వసతుల కోసం రూ.183 కోట్ల నిధులను మంజూరు ఇచ్చిందన్నారు. వెంటనే టెండర్లు పిలిపించి నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వం వంద సీట్ల ఎంబీబీఎస్‌కు అనుమతులు ఇవ్వగా నేడు 50 సీట్లకే అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. దీంతో భవిష్యత్‌లో పీజీ తరగతులు రావడానికి సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయన్నారు.

ఉచిత విద్యుత్‌పై ఇంటింటి సర్వే



ఎలుకుర్తిలో విద్యుత్ మీటర్ల వివరాలు సేకరిస్తున్న అధికారులతో ఎంపీపీ సౌజన్య

గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తి హవేలిలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఉచిత విద్యుత్‌పై ఆ శాఖ అధికారులు బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రజా పాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారు తమ ఆధార్, ఓటరు ఐడీ, ఫోన్ నంబర్లను మీటర్ల వద్ద కాగితంపై రాసి ఉంచాలని కోరారు. 200 యూనిట్ల లోపు కరెంటు వాడుకున్న వారికి ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తుందన్నారు. సర్వేలో ఎంపీపీ బీమగాని సౌజన్య, విద్యుత్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం అందజేత



రాయపర్తి : అశోక్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు



గీసుకొండ: మరియపురంలో ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి: తనతో చదివిన తోటి స్నేహితుడు ఆపదలో ఉన్నాడని తెలుసుకున తోటి స్నేహితులు అండగా నిలిచి అక్కున చేర్చుకున్నారు. మండలకేంద్రానికి చెందిన మచ్చ అశోక్ పక్షవాతంతో అనారోగ్యానికి గురై ఇంటివద్దే ఉంటున్నాడు. అతని తండ్రి రాములు ఇటీవలే మృతిచెందడంతో ఇబ్బందులు తలెత్తడంతో విషయం తెలుసుకున్న తనతో చదివిన 1997–98 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు అశోక్ ఇంటి వద్దకు చేరుకుని పరామర్శించారు. అనంతరం రూ.24 వేలఆర్థిక సహాయంగా అందించారు. అందజేసిన వారిలో స్నేహితులు ఎస్ స్వాతి, చెన్న బోయిన రవి, కర్ణాకర్, రాజేష్, ప్రభాకర్, మోహన్, మహేందర్‌రెడ్డి, స్వాతి, రాధిక, ఫెరోజ్‌ఖాన్, విష్ణు, అంకయ్య, శ్యామ్, యాకయ్య, ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గీసుకొండ: మండలంలోని మరియపురంలో ఆడెపు లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. బుధవారం ఆమె కుటుంబానికి మనుగొండకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు అల్లం బాలకిషోర్ రెడ్డి రూ. 5వేల ఆర్థికసాయం చేశారు. కాగా ఆ సహాయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు అల్లం మర్రెడ్డి, కూసం రమేశ్, సాయిల ప్రభాకర్, కొమ్ము శ్రీకాంత్, మాదాసి రాంబాబు, మర్రి క్రాంతి, జోజిరెడ్డి, దిలీప్‌రెడ్డి, బిట్ల శివ, కొగడాని మోహన్‌లు మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.

రాయపర్తిలో స్వయంపాలన దినోత్సవం



ఒకే వేదికపై విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రాయపర్తి: మండలకేంద్రంలోని శ్రీమహాత్మా హైస్కూల్‌లో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. డీఈఓగా సిద్ధార్థ, ఎంఈఓగా లాస్య, ప్రధానోపాధ్యాయురాలిగా లక్ష్మీప్రసన్నతో పలువురు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శిభపాల్, డైరెక్టర్లు వెంకట్ రెడ్డి, రవీనా, సోమన్న, సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించండి

● జెడ్పీ సీఈఓ రాంరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రాంరెడ్డి

సంగెం: అధికారులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేసి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు నందించాలని జెడ్పీ సీఈఓ జి.రాంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో తయారు చేసిన ప్రగతి ప్రణాళికలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులతో గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం పనులు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, సైడ్ కాల్వలు, అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీల మరమ్మతులు చేపట్టుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులను ఆ కాలనీల్లో పనులు చేపట్టాలని ఆ నిధులను ఇతర చోట్లకు మళ్లింపు చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

● అసంపూర్తి పనుల వద్ద గ్రామస్తుల నిరసన



ధర్మారంలో అసంపూర్తి పనుల వద్ద నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్, తదితరులు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్, ధర్మారంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం మాజీ సర్పంచ్ గోదాసి సూరయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు అసంపూర్తి పనుల వద్ద నిరసన తెలిపారు. అనంతరం సూరయ్య మాట్లాడుతూ తాను 25 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామంలో రూ.15 లక్షలతో వృద్ధుల ఆశ్రమ నిర్మాణం పనులను చేపట్టానన్నారు. తనకు ఇంకా రూ. 5 లక్షల మేర బిల్లులు రావాల్సి ఉందని, బీఆర్ఎస్ సర్కారు వచ్చిన తర్వాత బలవంతంగా, దౌర్జన్యం చేసి ఆశ్రమ భవనాన్ని స్వాధీనం చేసుకుని, తనపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారన్నారు. అలాగే భవనం ఇనుప కిటికీలు, తలుపులను తొలగించి కొందరు వాటిని మాయం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వృద్ధుల ఆశ్రమ భవనాన్ని కమ్యూనిటీ హాల్ పేరుతో మరమ్మతులు చేయడానికి రూ.50 లక్షల నిధులను మున్సిపల్ జనరల్ ఫండ్ కింద మంజూరు చేశారన్నారు. పనులు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేశారన్నారు. అలాగే మున్నూరుకాపు భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేయగా ఆ పనులు మధ్యలోనే నిలిచాయని, శ్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ. 50 లక్షల నిధులు కేటాయించగా నేటికీ పనులు ప్రారంభం కాలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్లు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే గ్రామంలో అభివృద్ధి కుంటు పడిందని ఆరోపించారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడిన వారిపై, పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై ఉన్నత స్థాయి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొల్లం విద్యాసాగర్, ముస్కు కోటయ్య, గాదె బాబు, బండి రాజేందర్, పోలెబోయిన గణేశ్, ముస్కు కనకయ్య, జవాజు కనకమల్లు, పర్ష సదానందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారికి సన్మానం



సంతోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్, గ్రామస్తులు

పర్వతగిరి: మండలంలోని ఏబీతండా ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ బుధవారం గ్రామపంచాయతీలో విధులు చేపట్టారు. ఈ మేరకు ప్రత్యేక అధికారిని కాంగ్రెస్ నాయకుడు గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎం. రవి, రమేష్, భద్రు, మోహన్, గోపి, వాల్య, మోహన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పూజలు



ఖానాపురం: మండలంలోని బుధరావుపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో భజన బృందం సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఈనెల 9న భజనలు చేయడానికి బుధవారం రెండు బృందాల బాధ్యులు కత్రపిచ్చిరెడ్డి, పడగాల రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 30 మంది తరలివెళ్లారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా పనిచేయాలి

● డీఎల్‌పీఓ ప్రభాకర్



సంగెం : తీగరాజుపల్లిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ ప్రభాకర్



ఖానాపురం : రంగాపురంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ సుమనవాణి

సంగెం: గ్రామాలను పరిశుభ్రంగా మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని తీగరాజుపల్లిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతీ పల్లెను పరిశుభ్రంగా మార్చాలని ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ప్రజాప్రతినిధులను, ప్రజలను, యువతను, మహిళలను భాగస్వాములను చేసి పరిశుభ్రమైన గ్రామాలుగా ఉంచాలని కోరారు. ప్రతీ రోజు గ్రామాల్లో రోడ్లు శుభ్రం చేసి, డ్రెయినేజీల్లో పూడిక తీయించి మురుగునీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీధుల్లో రోడ్లపై గుంతలను పూడ్చివేయాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ జి.రాజ్‌కుమార్, ఎంపీడీఓ కాసర్ల రవీందర్, ఎంపీఓ కొమురయ్య, ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

నల్లబెల్లి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రోడ్లను శుభ్రం చేసి గుంతలను పూడ్చివేశారు. ఇంటిపరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉన్న ఇంటి యజమానులకు ప్రత్యేకాధికారులు నోటీసులు అందించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంపీఓ కూచన ప్రకాశ్‌లు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


చెన్నారావుపేట : గ్రామాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ భారతి అన్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా వీధులు, రోడ్లు శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. పలు రకాల పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో శానిటేషన్ డ్రైవ్ షురూ..

నెక్కొండ : ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పకడ్బందీగా చేపట్టనున్నట్లు నెక్కొండ జీపీ ప్రత్యేకాధికారి తహసీల్దార్ రాజ్‌కుమార్ అన్నారు. పల్లెల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం మండల వ్యాప్తంగా కొనసాగాయి. మండల కేంద్రంలో ఆయన అంగడి, రైల్వే అండర్‌బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపితే వ్యాధులు దరి చేరవన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అందురూ బాధ్యత తీసుకొని చెత్తా చెదారాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్, ఏపీఓ జాకబ్, ఈఓ సదానందం, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీఓ సుమనవాణి అన్నారు. బుధవారం మండల వ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సైడ్ కాల్వలను శుభ్రం చేయాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. దోమలమందు పిచికారీ చేయాలని సూచించారు. ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



నెక్కొండ: ఆర్‌యూబీలో చెత్తను తొలగిస్తున్న పనులను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్



నల్లబెల్లి : రేలకుంటలో ఇంటి యజమానికి నోటీస్ అందిస్తున్న ప్రత్యేకాధికారి డాక్టర్ శ్రీనాథ్



చెన్నారావుపేట : పారిశుద్ధ్య పనులను చేపడుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

రేషన్‌బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

దుగ్గొండి: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 24 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండల కేంద్రం శివారులో పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు చెందిన పర్వతం పేతురు, చింతల దేవయ్యలపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్, నర్సింహారావు, దుగ్గొండి ఎస్సై జక్కుల పరమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.